క్లుప్తంగా

బడేటి విజయోత్సవాలు



కుటుంబ సభ్యుల మధ్య కేక్ కట్ చేస్తున్న చంటి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించిన బడేటి రాధాకృష్ణయ్య (చంటి) తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం విజయోత్సవాలు నిర్వహించారు. తొలుత కుటుంబ సభ్యుల మధ్య కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్నారు. అనంతరం క్యాంపు కార్యాలయానికి అధిక సంఖ్యలో విచ్చేసిన టీడీపీ కార్యకర్తలు, అభిమానులు ఆయనను పూల మాలలతో ముంచెత్తి అభినందించారు. అనేక మంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ ఈ విజయం కార్యకర్తలు, ప్రజలదేనని చెప్పారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని చెప్పారు.

సమన్వయంతో మెలగాలి



మెండెం సంతోష్ కుమార్

ఏలూరు (టూటౌన్): ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, పోటీ ఉన్న ఎవరో ఒక్కరే గెలుస్తారని, మిగిలిన వారికి ఓటమి తప్పదని, దీన్ని ప్రతిఒక్కరూ స్పోర్టివ్‌గా తీసుకుని సమన్వయంతో మెలగాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏలూరు పార్లమెంట్‌కు లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసిన డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ కోరారు. ఎన్నికల ఫలితాల అనంతరం గ్రూపులుగా విడిపోయి ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం వంటి చర్యలకు దిగొద్దని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు అనంతరం మనమంతా ఒక్కటిగానే మెలగాలని సూచించారు. పార్టీల అభిమానం ఎన్నికల సమయం వరకే పరిమితం చేయాలని, ప్రజలు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి జీవించాలని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీల నాయకులు సైతం రెచ్చగొట్టే విధంగా విద్వేషపూరిత ప్రసంగాలు చేయవద్దని, దాడులకు పురికొల్పవద్దని కోరారు. ఏలూరు జిల్లా ప్రశాంతతకు మారుపేరుగా నిలుస్తుందని, అటువంటి ఏలూరు జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు చోటివ్వకుండా నాయకులు, కార్యకర్తలు మెలగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా అధికార యంత్రాంగం సైతం జాగ్రత్త చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు పోలీసులు, అధికార యంత్రాంగానికి పూర్తిగా సహకరించాల్సిందిగా సంతోష్ కుమార్ కోరారు.

ప్రభుత్వ విద్యాలయాల్లో అడ్మిషన్ల కోసం విస్తృత ప్రచారం

పెదవేగి : రానున్న విద్యా సంవత్సరంలో తమ పాఠశాలలో విద్యార్థులను చేర్చుకునేందుకు ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల సిబ్బంది జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు ఈ విషయంలో ఓ అడుగు ముందే ఉన్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేసి తమ పాఠశాలలో చేర్పించండంటూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఉపాధ్యాయులు మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా ఇంటికీ వెళ్లి కరపత్రం తల్లిదండ్రులకు అందించి స్కూలు ప్రగతి, విద్యార్థులు సాధించిన ర్యాంకులు వివరిస్తూ తమ పాఠశాలలో పిల్లలను చేర్పించాలంటూ కోరుతున్నారు.

ఇంటర్, డిగ్రీ కళాశాలలదీ అదే తీరు

పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల వేటలో ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాల్లోని అధ్యాపకులు నిమగ్నమయ్యారు. టెన్త్, ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఇంటింటికీ వెళ్లి కలిసి తమ కళాశాలలోని సౌకర్యాలు, బోధన, సాధించిన ఫలితాలు, అమలు చేస్తున్న పథకాలను వివరించి వారిని ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. తమ కళాశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలంటూ ప్రచారం చేస్తున్నారు.

బడేటి చంటిదే ఏలూరు ఎమ్మెల్యే పీఠం

- ప్రతి రౌండులోనూ ఆధిక్యం
- రికార్డు స్థాయి మెజార్టీ



ఎమ్మెల్యేగా ఎన్నికైన చంటికి ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఆర్వో ముక్కంటి



కౌంటింగ్ కేంద్రం వద్ద సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ఈవీఎం తెరిచి ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది



కౌంటింగ్ సెంటర్‌లో సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఏలూరు అసెంబ్లీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగిన బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఘన విజయం సాధించారు. స్థానిక సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ బ్లాక్‌లో ఏలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం ముక్కంటి పర్యవేక్షణలో మంగళవారం ఉదయం ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. ఓట్ల లెక్కింపు ప్రతి రౌండ్‌లోనూ చంటి తన ఆధిక్యాన్ని ప్రదర్శించారు. ఏలూరు నియోజకవర్గంలో 1983వ సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో చెన్నకేశవుల రంగారావు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 47,515 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అప్పటి నుంచి ఈ రికార్డు ఆయన పేరిట కొనసాగింది. 41 సంవత్సరాల తరువాత ఆ రికార్డును బడేటి చంటి ఈ ఎన్నికల్లో 62,388 ఓట్ల మెజార్టీ సాధించి తిరగరాశారు.

రౌండ్ల వారీగా పోలైన ఓట్లు

ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఓట్లు 16 రౌండ్లలో లెక్కించారు. కూటమి అభ్యర్థి బడేటి చంటి మొదటి రౌండులో 8,216 ఓట్లు సాధించగా, వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఆళ్ల నాని 4,612 ఓట్లు సాధించారు. రెండో రౌండ్‌లో 6,056, మూడో రౌండ్‌లో 6,786, నాలుగో రౌండ్‌లో 7,300, ఐదో రౌండ్‌లో 6,422, ఆరో రౌండ్‌లో 7,184, ఏడో రౌండ్‌లో 7,053, ఎనిమిదో రౌండ్‌లో 6,632, తొమ్మిదో రౌండ్‌లో 7,428, 10వ రౌండ్‌లో 7,359, 11వ రౌండ్‌లో 6,073, 12వ రౌండ్‌లో 6,797, 13వ రౌండ్‌లో 8,506, 14వ రౌండ్‌లో 8,314, 15వ రౌండ్‌లో 6,236, 16వ రౌండ్‌లో 2,102 ఓట్లను బడేటి చంటి సాధించారు.

- చంటి సమీప ప్రత్యర్థి ఆళ్ల నానికి రెండో రౌండ్‌లో 3,175, మూడో రౌండ్‌లో 4,182, నాలుగో రౌండ్‌లో 3,860, ఐదో రౌండ్‌లో 3,343, ఆరో రౌండ్‌లో 2,392, ఏడో రౌండ్‌లో 2,406, ఎనిమిదో రౌండ్‌లో 3,030, తొమ్మిదో రౌండ్‌లో 2,548, 10వ రౌండ్‌లో 3,216, 11వ రౌండ్‌లో 2,533, 12వ రౌండ్‌లో 3,096, 13వ రౌండ్‌లో 2,422, 14వ రౌండ్‌లో 3,394, 15వ రౌండ్‌లో 3,559, 16వ రౌండ్‌లో 754 ఓట్లు సాధించారు. కాగా పోస్టల్ బ్యాలెట్లలో బడేటి చంటికి 2,203 ఓట్లు రాగా, ఆళ్ల నానికి 1,076 ఓట్లు లభించాయి.

నోటా ఓట్లు 1,256

ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి గత నెల 13వ తేదీన జరిగిన ఎన్నికల్లో మొత్తం 2,35,345 మంది ఓటర్లకు 1,65,132 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మరో 4,070 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీటిలో 1,62,872 ఓట్లు, 3,421 పోస్టల్ బ్యాలెట్లు చెల్లుబాటు అయినట్లు అధికారులు గుర్తించారు. నోటాకు ఈవీఎంల ద్వారా 1,212 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ల ద్వారా 44 ఓట్లు లభించాయి. చెల్లుబాటు అయిన మొత్తం ఓట్లలో బడేటి చంటికి 1,09,359 ఓట్లు లభించగా, ఆళ్ల నానికి 48,098 లభించాయి. పోస్టల్ బ్యాలెట్లతో కలిపి చంటికి 1,11,562 ఓట్లు రాగా, నానికి 49,174 ఓట్లు వచ్చాయి. దీంతో బడేటి చంటి తన సమీప ప్రత్యర్థి ఆళ్ల నానిపై 62,388 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. కాగా, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా గాజు గ్లాసు గుర్తుపై పోటీ చేసిన మత్తే బాబి 1,750 ఈవీఎం ఓట్లు, 20 పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలిపి 1,770 ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ కూటమి అభ్యర్థిగా సీపీఐ నుంచి పోటీ చేసిన బండి వెంకటేశ్వరరావుకు 604 ఓట్లు మాత్రమే లభించాయి.

సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

- చిరుధాన్యాల సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు
- తక్కువ కాలంలో కోత .. నికరంగా లాభం
- నేడు మార్కెట్‌లో మిల్లెట్స్‌కు పెరుగుతున్న డిమాండ్



సామల పంట



కొర్రల పంట



కొర్రలతో తయారు చేసిన వంటకం

బుట్టాయగూడెం: నేడు వ్యవసాయం ఆధునికంగా మారింది. వాణిజ్య పంటల వైపు రైతులు పరుగులు తీస్తున్నారు. తద్వారా బలవర్ధకమైన ఆహార పంటలు కనుమరుగవుతున్నాయి. ఆరు, ఏడు దశాబ్దాల నాడు రైతులు ఎలాంటి ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా బలవర్ధకమైన చిరు ధాన్యాలను పండించే వారు. అయితే ఆ తర్వాత వాటి సాగు కాలక్రమేపీ కనుమరుగైంది. నేడు పంటలు పండించే విధానం వల్ల వివిధ రకాల వ్యాధులు, అంతుచిక్కని రోగాలతో ప్రజలు సతమతమవుతున్నారు. లక్షలాది రూపాయలు వైద్యం కోసం ఖర్చు చేస్తున్నారు. దీంతో ఆహారపు అలవాట్లలో మార్పులు అనివార్యంగా భావిస్తున్నారు. ఈ మేరకు నాటి పేద రైతులు పండించే కొర్రలు, అండుకొర్రలు, సామలు, ఊదలు, అరికలు వంటి పంటలు ఇప్పుడు మిల్లెట్లుగా, సిరి ధాన్యాలుగా ప్రాచుర్యం పొందుతున్నాయి. ప్రతికూల వాతావరణాన్ని తట్టుకుని ఎటువంటి పరిస్థితుల్లోనైనా స్థిరమైన దిగుబడి ఇవ్వడంతో పాటు అధిక పోషక విలువలు కలిగిఉన్నవే చిరుధాన్యాలు. చిరుధాన్యాల వినియోగంపై అన్ని వర్గాల ప్రజలు ఆసక్తి చూపడంతో తాజాగా వీటి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

లాభాలు మెండు

చిరు ధాన్యాల సాగుతో లాభాలు మెండుగా ఉంటాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో మారుమూల కొండ ప్రాంతంలో నివసించే ఆదివాసీలు ప్రధాన పంటలు జొన్నలు, రాగులు, చోళ్లు వంటి పంటలు పండించే వారు. అయితే మారుతున్న కాలంతో పాటు గిరిజనులు కూడా ఆహారపు అలవాట్లలో మార్పులు కోరుకున్నారు. ప్రస్తుతం వారు కూడా చిరు ధాన్యాల సాగువైపు మళ్లీ దృష్టి సారించారు. సిరుల పంటలపై ప్రస్తుతం పెరిగిన డిమాండ్ కారణంగా మిల్లెట్స్ పేరు (న్యూట్రీ గ్రెయిన్స్)గా, సిరి ధాన్యాలుగా మారిపోయింది. ప్రజల్లో ఆరోగ్యదాయక ఆహారంపై శ్రద్ధ పెరగగా సిరి ధాన్యాల సాగుపై రైతులు శ్రద్ధ చూపుతున్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంపై చిరుధాన్యాలైన కొర్రలు, అండుకొర్రలు, ఊదలు, సామలు, అరెకల పంట సాగు, వాటిలో పోషకాల లభ్యతను వ్యవసాయశాఖ అధికారులు వివరించారు.

సామలతో గుండె సమస్యలు దూరం

సామల పంట ఏ నేలలోనైనా పండుతుంది. అధిక ఉష్ణోగ్రత, నీటిని తట్టుకుంటుంది. జూన్ నుంచి జులై చివరివారం వరకూ ఈ పంటను విత్తుకోవచ్చు. సాళ్ల మధ్య 25 సెంటీమీటర్ల, మొక్క మధ్య 10 సెంటీమీటర్లు దూరం ఉండాలి. ఈ పంటకాలం 80 నుంచి 90 రోజులు. ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. సస్యరక్షణకు సాధారణ పంటల మాదిరిగానే పనులు చేపట్టాల్సి ఉంటుంది.

లాభాలు : సామల పంట తియ్యగా ఉంటాయి. వీటి ఆహారంగా తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు పరిష్కరించబడతాయని వైద్యులు సూచిస్తున్నారు. పైత్యం ఎక్కువ అవ్వడం వల్ల భోజనం తర్వాత గుండెల్లో మంటగా ఉండడం, కడుపు ఉబ్బరంగా ఉండటం వంటి సమస్యలకు సామలు ఔషధంగా పనిచేస్తుంది. సుఖవ్యాధులు, అతిసారం, అజీర్ణం తగ్గిపోతుంది. పీచుపదార్థం మలబద్ధకాన్ని అరికడుతుంది. మైగ్రేన్ సమస్యను దూరం చేస్తుంది. గుండె సమస్యలు, ఊబకాయం, కీళ్ల నొప్పులకు సామల పంట బలవర్ధకమైన ఆహారం.

అరికెలతో పోషకాలు పుష్కలం

ఈ పంట ఏ నేలలో అయినా పండుతుంది. నీటి ఎద్దడిని తట్టుకుంటుంది. పొడి వాతావరణం చాలా అనుకూలం. జూన్ నుంచి జులై నెలాఖరు వరకూ విత్తుకోవచ్చు. సాళ్ల మధ్య 25 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్లు ఉండాలి. పంట కాలం 95 రోజుల నుంచి 100 రోజుల వరకూ ఉంటుంది. ఎకరానికి 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

లాభాలు : అరికెలు తీపి, వగరు, చేదు రుచులు కలిగి ఉంటాయి. అధిక పోషకాలు కలిగి ఉండటం వల్ల పిల్లలకు మంచి ఆహారంగా పని చేస్తుంది. విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉంటాయి. జీర్ణశక్తి పెరుగుతుంది. కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా నివారిస్తుంది. వీటిని పప్పు దినుసులైన బొబ్బర్లు, శనగలతో కలిపి తీసుకుంటే శరీరానికి కావాల్సిన పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. వాతం, కీళ్లవాతానికి, కంటి, నరాల బలహీనతకు అరికెలు మంచి ఆహారం. అరికె పిండి వాపులకు పైపూతగా వాడతారు.

ఊదలతో వ్యాధి నిరోధక శక్తి పెంపు

ఈ పంట ఏ నెలలోనైనా పండుతుంది. వరికి ప్రత్యామ్నాయ పంట. సాళ్లకు సాళ్లకు మధ్య 25 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్లు ఎడం ఉండాలి. పంట కాలం 90 నుంచి 95 రోజులు. దిగుబడి ఎకరాని 5 నుంచి 8 క్వింటాళ్ల వరకూ వస్తుంది. సస్యరక్షణ చర్యలు మామూలు పంట మాదిరిగానే చేసుకోవాలి.

లాభాలు : ఊదలు రుచికి తియ్యగా ఉంటాయి. ఊదలతో తయారు చేసిన ఆహారం బలవర్ధకంగా ఉంటుంది. సులభంగా జీర్ణమవుతుంది. ఉత్తర భారత దేశంలో ఉపవాస దీక్షలో ఎక్కువగా వినియోగిస్తారు. ఉత్తరాఖండ్, నేపాల్‌లో ఊదల ఆహారాన్ని గర్భిణులు, బాలింతలకు ఎక్కువగా ఇస్తారు. ఊదలు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి. చిన్నపేగుల్లో ఉండే పుండ్లు, పెద్ద పేగులకు వచ్చే కేన్సర్ బారిన పడకుండా ఇవి కాపాడతాయి.

అల్సర్, కేన్సర్ చికిత్సకు అండు కొర్రలు

వీటిని ఏ నేలలోనైనా పండించవచ్చు. అతి తక్కువ వర్షపాతం ఉన్నా పంట చేతికి అందుతుంది. ఎకరానికి 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. సాళ్ల మధ్య 60 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్లు దూరం ఉండాలి. ఒక్కో దుబ్బుకు 15 నుంచి 20 పిలకలకు వస్తాయి. పంటకాలం 85 రోజులు. సస్యరక్షణకు ఎరువుల వినియోగం మామూలుగా ఎర్రజొన్నలా వేస్తే సరిపోతుంది.

లాభాలు : సాంప్రదాయ పంటల్లో అండుకొర్రలు ఒకటి. అండుకొర్రలను నాలుగు గంటలు నానబెట్టిన తర్వాతే వండుకోవాలి. జీర్ణాశయం, ఆర్థరైటిస్, బీపీ, థైరాయిడ్ వంటి సమస్యలు, ఊబకాయ నివారణకు ఉపయోగపడతాయి. అల్సర్, కేన్సర్ చికిత్సకు బాగా ఉపయోగపడతాయి.

గర్భిణులకు చిరుధాన్యాల ఆహారం

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులకు చిరుధాన్యాలనే నేడు ఆహారంగా ఇస్తున్నారు. దీనివల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని మహిళలు చెప్తున్నారు. అలాగే బాల సంజీవని కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలతో పాటు పిల్లలకు కూడా కొర్రలు, రాగి, జొన్నలు వంటి ఆహారాన్ని మెనూ ప్రకారం అందిస్తున్నారు.

కొర్రలతో యాంటీ ఆక్సిడెంట్‌లు అధికం

తేలికపాటి ఎర్ర చెల్క నేలల్లో ఎక్కువగా వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో పండించుకోవచ్చు. ఖరీఫ్ జూన్ రెండో వారం నుంచి జులై చివరి వారం వరకూ విత్తుకోవచ్చు. వరుసల మధ్య 30 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్లు దూరం ఉండేలా నాటుకోవాలి. పంట కాలం 75 నుంచి 80 రోజులు. ఎకరానికి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. చీడ, పీడలు చాలా తక్కువ. క్రిమికీటకాలు ఆశిస్తే సాధారణ పంటలకు పిచికారీ చేసిన మందులనే వాడితే సరిపోతుంది.

లాభాలు : కొర్రలు తీపి, వగరు రుచులు కలిగి ఉంటాయి. మధుమేహం వ్యాధిగ్రస్తులకు మంచి ఆహారం. శరీరంలో కొలెస్ట్రాల్ పరిమాణాన్ని తగ్గిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్‌లు అధికంగా ఉంటాయి. కొర్రల్లో అధిక పీచుపదార్థం, మాంసకృతులు, కాల్షియం, ఐరన్, మాంగనీస్, మెగ్నీషియం, భాస్వరంతోపాటు విటమిన్లు అధిక పాళ్లలో ఉంటాయి. చిన్నపిల్లలు, గర్భిణిలకు మంచి ఆహారం. ఉదయ సంబంధిత వ్యాధులకు ఉపశమనం కలిగిస్తుంది.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నాం



చిరుధాన్యాల పంటలపై రైతులను ప్రోత్సహిస్తున్నాం. పంటల ప్రాముఖ్యతపై గ్రామాల్లో రైతులతో అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నాం. పాత తరంవారు వెంటనే పంటలు వేసేందుకు ముందుకు వస్తున్నారు. చిరుధాన్యాల పంటల సాగు పెరగాలంటే కొంత సమయం పడుతుంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో కూడా చిరుధాన్యాల పంటలు వేసేలా ప్రోత్సహిస్తాం.

– డి.ముత్యాలరావు, ఏఓ, బుట్టాయగూడెం

అరుదైన ఫలాలకు ఔషధ గుణాలెన్నో



సీతారామ లక్ష్మణ హనుమద్ ఫలాలు

కొయ్యలగూడెం: ఇతిహాసాలను ఇనుమడించేలా ప్రకృతిలో కాసిన కాయలకు మన పూర్వీకులు పెట్టిన పేర్లు సనాతన హైందవమత సంస్కృతి సాంప్రదాయానికి ఆలంబనగా నిలిచాయి. అటువంటి వాటిలో సీత రామ లక్ష్మణ హనుమద్ ఫలాలు ఒకటి. నేటి తరం వారికి సీతాఫలం గురించి తెలిసి ఉంటుందే కానీ రామలక్ష్మణ హనుమద్ ఫలాలు గురించి అంతగా తెలిసి ఉండకపోవచ్చు. పచ్చని రంగుతో సీతాఫలం, రామనీలంతో రామా ఫలం, కాయపై ముళ్లతో ఉమ్మెత్త కాయను పోలిన విధంగా ఉండే లక్ష్మణ ఫలం, సింధూర వర్ణంతో హనుమద్ ఫలం ఉండడం విశేషం. నాలుగు రకాల ఫలాలకు 17 రకాల కేన్సర్ వ్యాధులను నిరోధించే, నిర్మూలించే శక్తి ఉండటం వీటి ప్రాముఖ్యత. శాస్త్రీయంగా కూడా కేన్సర్ వ్యాధులకు ఈ నాలుగు రకాల పండ్లు మేలు చేకూరుస్తాయని నిపుణులు సైతం ధ్రువీకరించారు. సంవత్సరం పొడుగునా నాలుగు రకాల ఫలాలు కాయడం వీటి విశిష్టత. వర్షాకాలం, శీతాకాలంలో సీతాఫలం, శీతాకాలం ముగింపులో హనుమద్ ఫలం, వేసవికాలంలో రామలక్ష్మణ ఫలాలు కాస్తుంటాయి. ఎన్నో రెట్ల ఔషధ గుణాలు కలిగిన పండ్ల గుజ్జు మొదలుకొని పైన తొక్క, గింజలు సైతం ఆయుర్వేదంలో వైద్య చికిత్సకు వినియోగిస్తుంటారని ఆయుర్వేద ప్రముఖ వైద్యులు డాక్టర్ మోహన్ (పంగిడిగూడెం) పేర్కొన్నారు.

నిర్మానుష్యంగా ఏలూరు నగరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల కౌంటింగ్ జిల్లా కేంద్రం ఏలూరులోని సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ ఎన్నికల నిమిత్తం సోమవారం ఉదయం నుంచే నగరం రద్దీగా మారగా, మంగళవారం ఉదయం పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా మారింది. కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభించడంతో ఆయా అసెంబ్లీ స్థానాల నుంచి విచ్చేసిన వివిధ పార్టీల అభిమానులు, కార్యకర్తలు నగరంలోని లాడ్జిల్లో రూముల్లో ఉండి టీవీల్లో ఫలితాల సరళిని గమనిస్తూ ఉన్నారు. ఉదయం 10 గంటల సమయానికే కౌంటింగ్‌పై విశ్లేషించుకున్న కొందరు అప్పటి నుంచే రూములు ఖాళీ చేసి తిరుగు ప్రయాణమవడం కనిపించింది. కాగా గెలుస్తున్న అభ్యర్థుల తాలూకు అభిమానులు, కార్యకర్తలు తమ అభ్యర్థులకు వస్తున్న మెజారిటీపై, ఏ గ్రామంలో పోలింగ్ ఎలా జరిగింది? ఎక్కడ ఓట్లు ఎక్కువ వచ్చాయి? ఎక్కడ తక్కువ వచ్చాయి? అనే విశ్లేషణలు చేసుకున్నారు. కాగా కౌంటింగ్ ప్రాంతానికి నియమావళిని అనుసరించి 200 మీటర్ల దూరంలో కొందరు కార్లలో వేచి చూస్తూ ఫోన్లలోనే తమ నాయకుల విజయాలకు సంబంధించిన విషయాలను తమ గ్రామాల్లోని తమ కార్యకర్తలతో పంచుకోవడం కనిపించింది. కౌంటింగ్ నేపథ్యంలో నగరంలోని దుకాణాలు మూసివేయడం, ప్రజలుసైతం టీవీలకు అతుక్కుపోయి కౌంటింగ్‌కు సంబంధించిన వార్తలు చూస్తూ బయటకు రాలేదు. ఈ నేపథ్యంలో నగరం మొత్తం నిర్మానుష్యంగా మారింది. గెలిచిన అభ్యర్థుల ర్యాలీలు, విజయోత్సవాలు చేయడానికి లేదని ఎన్నికల కమిషన్ నిబంధన విధించడంతో నగరంలో ఎక్కడా ర్యాలీలు కనిపించలేదు. అక్కడక్కడా పేటల్లో యువకులు బైకులపై శబ్దాలు చేస్తూ తిరగడం వీధుల్లో బాణసంచా కాల్చుతూ సంబరాలు చేసుకోవడం మినహా పెద్దగా హడావుడి కనిపించలేదు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వెంకన్న చెరువు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతల నిమిత్తం బుధవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని చిరంజీవి బస్ స్టాండ్, దక్షిణపు వీధి, మార్కండేయ స్వామి దేవస్థానం ప్రాంతం, రాజా గారి మేడ ప్రాంతం, జేపీ కాలనీ, పెద్ద దేవుడి గుడి ప్రాంతం, పోణంగి రోడ్డు, శనగపప్పు బజారు పరిసర ప్రాంతాల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

దివ్యాంగుల పాఠశాలలో 'ప్రత్యేక' శిక్షణ

- పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండ
- నామమాత్రపు ఫీజులతో చిన్నారులకు విద్యా సేవలు



జానంపేటలోని ప్రకాశ్‌నగర్‌లో ప్రత్యేక అవసరాల చిన్నారుల కోసం నిర్మించిన ప్రత్యేక పాఠశాల



కంప్యూటర్, వినికిడి యంత్రం ద్వారా శిక్షణ పొందుతున్న చిన్నారులు



తరగతి గదిలో విద్యార్థులు

పెదవేగి : ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలకు చేయూత ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డిసాలెస్ స్పెషల్ స్కూల్ హెచ్ఎం సిస్టర్ సుష మ్యాథ్యూ అన్నారు. పెదవేగి మండలంలోని జానంపేట పంచాయతీ పరిధిలోని ప్రకాశ్‌నగర్‌లో 2006లో డిసాలెస్ ప్రత్యేక పాఠశాలను (చెవుడు, మూగ విద్యార్థులకు మాత్రమే) స్థాపించారు. ఈ ప్రత్యేక అవసరాల పాఠశాల డాటర్స్ ఆఫ్ సెయింట్ ఫ్రాన్సిస్ డిసాలెస్ అనే మిషనరీ ఎన్‌జీఓ సంస్థ ద్వారా నడుపుతున్నారు. ఈ పాఠశాల్లో 1 నుంచి 10వ తరగతి వరకూ బోధన చేస్తున్నారు. ఈ పాఠశాల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గుర్తింపు పొందింది. ప్రత్యేక శిక్షణ పొందిన బోధన సిబ్బందితో తరగతులను నిర్వహిస్తున్నారు. పాఠశాలలో ప్రస్తుతం 50 మంది బాలబాలికలు విద్యనభ్యసిస్తున్నారు. మరో 50 మంది వరకూ అడ్మిషన్లు పొందేందుకు అవకాశం ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇక్కడ విద్యనభ్యసించే విద్యార్థులు జిల్లా నుంచే కాక ఇతర రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇక్కడ ప్రభుత్వ పాఠశాలల్లో బోధించే స్టేట్ సిలబస్‌నే బోధిస్తారు. 15 ఏళ్లలోపు మూగ, చెవుడు విద్యార్థులు ఇక్కడ దరఖాస్తు చేసుకోవటానికి అర్హులు. విద్యతోపాటు, పూర్తి హాస్టల్ సదుపాయం సైతం ఉచితంగా కల్పించారు. చదువుతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో సైతం శిక్షణ ఇస్తున్నారు. ఇతర వివరాలకు ఫోన్ 6281428466, 8985468473, 7356006778 నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి



డాటర్స్ ఆఫ్ సెయింట్ ఫ్రాన్సిస్ డిసాలెస్ పాఠశాలను ఏర్పాటుచేసి పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని చెవిటి, మూగ చిన్నారులకు బాసట నిలిచేందుకు కృషి చేస్తున్నాం. నామమాత్రపు ఫీజులతో అందించే ఈ విద్య, వసతి సౌకర్యాన్ని అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలి.

– సిస్టర్ సుష మ్యాథ్యూ, ప్రిన్సిపల్, డిసాలెస్ ప్రత్యేక పాఠశాల